క్లుప్తంగా

ప్లాస్టిక్ వినియోగంపై తనిఖీలు



వినుకొండ: మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ షేక్ ఇస్మాయిల్ ఆధ్వర్యంలో పట్టణంలోని హోల్‌సేల్ దుకాణాలు, రిటైల్ షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధంపై వ్యాపారస్తులకు నోటీసులు ఇవ్వడం జరిగిందని, ఎవరైనా ప్లాస్టిక్‌ను విక్రయించినా, వినియోగించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అటువంటి వారిపై రూ.5వేలు జరిమానా విధిస్తామన్నారు.

ఉద్యోగాలకు ఎంపికైన తిరుమల విద్యార్థులు



నరసరావుపేట రూరల్: తిరుమల ఇంజినీరింగ్ కళాశాలలో బెంగుళూరుకు చెందిన కోడ్‌నెస్ట్ సంస్థ నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో తొమ్మిది మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారు. ప్రాంగణ ఎంపికలకు వివిధ విభాగాల నుంచి 170 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరికి గ్రూప్‌డిస్కషన్, టెక్నికల్ ఇంటర్వ్యూ, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి తొమ్మిది మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులకు రూ.3.5 లక్షల వార్షిక వేతనం లభిస్తుందని కంపెనీ ప్రతినిధి మనస్విని తెలిపారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను కళాశాల చైర్మన్, మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, కార్యదర్శి రావెల సత్యనారాయణ, ప్రిన్సిపల్ డాక్టర్ వైవీ వెంకట్రావు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎం.సాంబశివరావులు అభినందించారు.

సారా తయారీ చట్టరీత్యా నేరం



బొల్లాపల్లి: నవోదయం 2 కార్యక్రమంలో భాగంగా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని బ్రిడ్జి తండా, బోడిపాలెం తండాల్లో నాటు సారాయి నేరాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఈపూరు ఎక్సైజ్ స్టేషన్ సీఐ డి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నాటుసారాయి తయారు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. తయారు చేయడం, రవాణా చేయడం, నాటుసారా కలిగి ఉన్నా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐలు శ్రీనివాసరావు, రెహమాన్, సిబ్బంది, తండా వాసులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం



నరసరావుపేట టౌన్: అగ్ని ప్రమాదం సంభవించి ఇంట్లో గృహోపకరణాలు మంగళవారం పట్టణంలో చోటు చేసుకుంది. అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. కోటప్పకొండ రోడ్డు వెంగళరెడ్డి కాలనీకు చెందిన షేక్ నాగూర్ ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించి మంటలు చెలరేగాయి. గృహంలోని వస్తువులు, గృహోపకరణాలు, దుస్తువులు, దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. సంఘటనలో సుమారు రూ.2 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు.

విద్యుత్ వినియోగదారుల న్యాయ సదస్సు

యడ్లపాడు: గుంటూరు జిల్లా విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించేందుకు ఈనెల 13న గురువారం విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక విజయవాడ ఆధ్వర్యంలో ప్రత్యేక న్యాయ సదస్సు నిర్వహించనున్నారు. చిలకలూరిపేటలోని సుబ్బయ్య తోట 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రంలో ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు ఈ సమావేశం జరుగనుంది. ఈ సదస్సుకు విశ్రాంత జిల్లా న్యాయమూర్తి ఎన్. విక్టర్ ఇమ్మానుయేల్ (చైర్మన్, విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక, విజయవాడ), సాంకేతిక సభ్యుడు కె. వెంకటకృష్ణ, ఆర్థిక సభ్యుడు ఆర్. సి. హెచ్. శ్రీనివాసరావు, స్వతంత్ర సభ్యురాలు ఏ. సునీత హాజరవుతారు. కావున ఫిరంగిపురం, డోకిపర్రు, పత్తిపాడు, వట్టి చెరుకూరు, చిలకలూరిపేట టౌన్-1, టౌన్-2, రూరల్, గణపవరం, యడ్లపాడు సెక్షన్ల పరిధిలోని వినియోగదారులు తమ పరిష్కారం కాని సమస్యలను రాతపూర్వకంగా సమర్పించి తక్షణమే పరిష్కారం పొందవచ్చని, గుంటూరు టౌన్-2 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వై ఏడుకొండలు తెలిపారు.

జ్ఞానజ్యోతులు వెలిగిస్తున్న మానవమూర్తులు

- పుస్తకాల్ని దాటి.. జీవన పాఠాల్ని నేర్పుతున్న బడి
- పాఠశాలే ప్రతిభా వేదికగా మార్చుతున్న కొత్తసాలన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల గురువులు

యడ్లపాడు: కొత్తసాలన గ్రామంలోని మండల పరిషత్ ఏపీ ప్రాథమిక పాఠశాల, విద్యా విలువలను కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం చేయకుండా, ప్రతిభను వెలికితీయగల వేదికగా నిలుస్తోంది. పాఠశాలలో సరైన మౌలిక వసతులు లేకున్నా, విద్యార్థుల్లో ప్రతిభకు కొదవలేదు. పాఠశాల హెచ్ఎం షేక్ ఝున్నుసాహెబ్, ఎంటీఎస్ -98 బ్యాచ్ (మినిమం టైంస్కేల్) వీసీ వినయ్‌కుమార్ సమన్వయంగా ప్రత్యేక శ్రద్ధతో 37 మంది విద్యార్థులను విద్యా వికాసంలో వినూత్న బోధనతో చేస్తూ కొత్త మార్గాలను ఆవిష్కరిస్తున్నారు. విద్యతో పాటు వివిధ విభాగాల్లోనూ మెరికలుగా మలుస్తున్నారు. ఉపాధ్యాయుల నిరంతర శ్రద్ధ, విద్యార్థుల కృషి, పిల్లల తల్లిదండ్రులు ప్రోత్సాహం వెరసి ఈ పాఠశాలని ఆదర్శంగా నిలిపాయి.

పర్యావరణ హిత విద్య

పర్యావరణ పరిరక్షణకు ప్రాముఖ్యత ఇస్తూ, ఉపాధ్యాయులు విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను నాటుతున్నారు. మొక్కలు నాటడం, పరిశుభ్రతను పాటించడం వంటి కార్యక్రమాల ద్వారా పర్యావరణ ప్రేమను పెంపొందిస్తున్నారు. ప్రతిపాఠాన్ని పిల్లలచే లోకాస్ట్- నోకాస్ట్‌తో టీఎల్ఎం తయారు చేయించి వాటిద్వారా నేర్పించడం గమనార్హం.

గణితమే ఆటగా మార్చే బోధనతీరు

వేదిక్ గణితం ద్వారా క్లిష్ట సమీకరణాలను వేగంగా పరిష్కరించడం, ఫింగర్స్ మ్యాథ్స్ ద్వారా చేతులు వీపు వెనుక ఉంచి పెద్ద సంఖ్యల అంక గణితాన్ని మెలకువగా చెప్పడం విద్యార్థుల్లో గణిత భయం పోగొడుతున్నాయి.



టీఎల్ఎంతో బోధన చేస్తున్న ఉపాధ్యాయుడు వినయ్‌కుమార్

భాషా సంపద – సృజనాత్మక వికాసం

పద్య సంపదలో నైపుణ్యం పెంచుతూ వేమన, సుమతీ శతకం పద్యాలను కళ్లు మూసుకొని స్పష్టంగా చెప్పగలగడం. 1–5 తరగతుల వారికి ఇంగ్లిష్ పద నైపుణ్యాన్ని పెంచేందుకు 1000 వరకు పదాలను నిరంతరం అభ్యాసం చేయించడం. క్యాలీగ్రఫీ శిక్షణ ద్వారా అందమైన చేతిరాత అభివృద్ధి పరచడం, బొమ్మలు వేయడం, వాటికి రంగులు అద్దడం, పెయింటింగ్, డిజైనింగ్, గ్రీటింగ్ కార్డుల తయారీపై తర్ఫీదు ఇస్తూ ప్రోత్సహిస్తున్నారు.

పోటీలలో సత్తా.. 19 మెడల్స్ కైవసం

గతేడాది ఆగస్టులో నిర్వహించిన జాతీయస్థాయి రంగోత్సవ్ పోటీల్లో పాఠశాల విద్యార్థులు 19 మెడల్స్ సాధించడం గర్వకారణం. కళా విభాగంలో స్కెచ్చింగ్, డ్రాయింగ్, హ్యాండ్ రైటింగ్, గ్రీటింగ్ కార్డుల తయారీ మొదలైన విభాగాల్లో ప్రతిభను ప్రదర్శించి గోల్డ్ మెడల్స్ -8, సిల్వర్ -5, బ్రాంజ్ -4, మెరిట్ అవార్డ్ ట్రోఫీ -1, ప్రత్యేక గిఫ్ట్ -1, సర్టిఫికెట్లు పొందడం విశేషం. ఆ ఏడాది ఫిబ్రవరి 3వ తేదీన అంతర్జాతీయస్థాయి రంగోత్సవ్ పోటీల్లోనూ ఏడుగురు పాల్గొనడం గమనార్హం.

స్వీయ రచనలతో సులభతర బోధన



బోధన కోసం విద్యార్థులు రూపొందించిన టీఎల్ఎంలు

ఈ పాఠశాల విద్యను కేవలం పాఠ్యగ్రంథాలకే పరిమితం చేయకుండా, విద్యార్థుల మేధస్సుకు కొత్త ఆలోచనలను ఆవిష్కరిస్తూ భవిష్యత్ తరాలను తీర్చిదిద్దుతున్నారు. '1000 ఇంగ్లిష్ పదాలు పొందిపర్చిన' థౌజండ్ వర్డ్ జాయ్‌ఫుల్' పుస్తకం, క్యాలీగ్రఫీలో శిక్షణకు అవసరమైన 'బెస్ట్ హ్యాండ్ రైటింగ్ గైడ్', గణితంపై పట్టు సాధించేందుకు 'సింపుల్ మైండ్ మ్యాథ్స్' వంటి వర్క్ బుక్స్‌ను హెచ్ఎం ఝున్ను మాస్టార్ స్వీయ రచనలు చేసి ఆయా పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు.

మక్కువ పెంచింది



'మా ఉపాధ్యాయుల బోధన వల్లే మా ప్రతిభ వెలుగులోకి వచ్చింది. అమూల్యకు చేతిరాత మెరుగుపడింది, ఇంద్రాణికి ఫింగర్ మ్యాథ్స్ వేగంగా అర్థమయ్యాయి, సంగీతకు వేదిక్ గణితంపై మక్కువ పెరిగింది. ఈ పాఠశాల మాకు భవిష్యత్‌ను తీర్చిదిద్దే మార్గం.

–జి.అమూల్య, ఎం.ఇంద్రాణి, టి.సంగీత – విద్యార్థినులు

అన్నింటా ప్రావీణ్యం



'భార్గవి పద్యాలను అద్భుతంగా చదవగలదు. సుహాస్, సిరి ఇంగ్లిష్ పదాలను చక్కగా పలుకుతారు. మాకు ఈ బోధన విధానమే అత్యుత్తమ విద్యా మార్గదర్శి. గణితం అంటే మాకెంతో భయముండేది. కానీ మా గురువులు ఆటల రూపంలో బోధించడంతో అది చాలా ఈజీగా అనిపిస్తోంది.

–టి.భార్గవి, ఎస్.సుహాస్, వి.సిరి – విద్యార్థులు

నేటి యువత పోరు జయప్రదం చేయండి

మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి

నరసరావుపేట: వైఎస్సార్ సీపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం నిర్వహించే యువత పోరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యార్థి, నిరుద్యోగ వ్యతిరేక విధానాలకు నిరసనగా యువత పోరు చేపట్టడం జరిగిందన్నారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ పథక అమలుపై కూటమి ప్రభుత్వ దాటవేత వైఖరిని ప్రతి ఒక్కరూ నిరసించాలన్నారు.

ఉదయం 10 గంటలకు స్థానిక గుంటూరు రోడ్డులోని పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా జిల్లా కార్యాలయంకు చేరుకొని అక్కడి నుంచి ఏడు నియోజకవర్గాల నాయకులతో కలిసి కలెక్టర్ కార్యాలయం వరకు వెళ్లి నిరుద్యోగ, విద్యార్థుల సమస్యలపై జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించటం జరుగుతుందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ యువత, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలు, నియోజకవర్గ ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

అగ్రహారం భూముల్లో భాగస్వామ్యం తప్పనిసరి

తహసీల్దారు ఎ.నళిని

ఈపూరు (శావల్యాపురం): మండలంలోని అంగలూరు గ్రామంలో అగ్రహారం భూములకు సంబంధించి గ్రామసభను రెవెన్యూ అధికారులు, ఉత్తరాది మఠం ప్రతినిధులతో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామసభలో తహసీల్దారు ఎ.నళిని పాల్గొని మాట్లాడుతూ నిబంధనలు మేరకు, కలెక్టరు ఆదేశాలకు అనుగుణంగా అగ్రహారం భూములకు సంబంధించి పరిష్కరించే దిశలో భాగంగా రైతులు భాగస్వామ్యం తప్పనిసరిగా ఉండాలన్నారు. అంగలూరు గ్రామంలో 1264 ఎకరాలు గ్రామ విస్తీర్ణం ఉండగా అందులో 905 ఎకరాలు బెంగుళూరు ఉత్తరాది పీఠానికి చెందగా, మిగిలిన భూములన్నీ సర్వీసు ఈనాం ప్రభుత్వ భూములుగా నిర్ధారించారు. గ్రామసభలో పాల్గొని రెవెన్యూ అధికారులు, రైతులు మాట్లాడిన అంశాలతో పాటు ఏమైనా అభ్యంతరాలు ఉన్న పక్షంలో రైతులందరూ ఐక్యంగా కమిటీగా ఏర్పడితే, ఉత్తరాది మఠం కమిటీ సభ్యుల దృష్టికి తీసుకొని వెళ్లి రైతులకు న్యాయం చేస్తామని ప్రతినిధులు తెలిపారు. ఇప్పటికే జిల్లా గజిట్ ఫాం-1, ఫాం-2 నో టీసులు ప్రచురణ చేశామని, రైతులు, ఉత్తరాది మఠం ప్రతినిధుల సమక్షంలో సర్వే జరుగుతుందని తహసీల్దారు తెలిపారు. సర్వే పనులు పూర్తయిన తర్వాత రైతులు, ఉత్తరాది మఠం ప్రతినిధులతో మళ్లీ చర్చించి జిల్లా కలెక్టరు ఆదేశాలకు మేరకు తదుపరి నిర్ణయం తీసుకుంటామని తహసీల్దారు వెల్లడించారు. ఈ గ్రామసభలో మండల సర్వేయర్ పవన్ కుమార్, ఏవో రామినేని రామారావు, వీఆర్వో కాకర్లబోయిన వెంకటేశ్వర్లు, సచివాలయ సర్వేయర్ కిరణ్, పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దారు నళిని

శిథిలావస్థకు చేరిన వంతెనలు

నూజెండ్ల: మండలంలోని పమిడిపాడు బ్రాంచ్ కెనాల్ పరిధిలో జమ్మలమడక మేజరు మార్గంలో ఏర్పాటు చేసిన వంతెనలు శిథిలావస్థకు చేరి ప్రమాదాలకు నిలయంగా మారాయి. 40 సంవత్సరాల క్రితం కాలువలు నిర్మాణాల సమయంలో ఆయా గ్రామాలకు వెళ్లడానికి అనుసంధానంగా ఏర్పాటు చేసిన వంతెనలు ప్రస్తుతం ప్రమాదభరితంగా మారాయని వాహనదారులు వాపోతున్నారు. నూజెండ్ల నుంచి దర్శి రహదారి మార్గంలో రవ్వారం వద్ద ఉన్న వంతెన, నూజెండ్ల నుంచి అప్పాపురం తలార్లపల్లి, మారెళ్ళవారిపాలెం వెళ్ళే ఆర్ అండ్ బీ రహదారిలో ఉన్న వంతెనలకు సంబంధించి ఇరువైపులా రైలింగ్ పూర్తిస్థాయిలో దెబ్బతిన్నాయి. రాత్రి సమయంలో అయితే దగ్గరకు వచ్చే వరకు వంతెన కనిపించకపోవటంతో ప్రమాదం పొంచి ఉందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.



రైలింగ్ లేక ప్రమాదంగా మారిన వంతెన

పంటకోతలు పూర్తయ్యాక భూసార పరీక్షలు చేయాలి

చిలకలూరిపేట: రబీ సీజన్‌లో వేసిన పంట కోతలు పూర్తి అయ్యాక వేసవిలో రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలని జిల్లా వనరుల కేంద్రం డీడీఏం శివకుమారి తెలిపారు. మండలంలోని వేలూరు, కుక్కపల్లివారిపాలెం గ్రామాలలో పొలం పిలుస్తోంది, ఆహార, పోషకాహార భద్రత కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూసార పరీక్షలతో పాటు వేసవి దుక్కులు కూడా చేసుకోవాలని సూచించారు. తెల్లచౌడు భూముల వారు, జిప్సం లేని వారు మడులు కట్టి నీళ్లు పెట్టి వదిలివేస్తే చౌడు తగ్గుతుందని తెలిపారు. రైతులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ పోర్టల్‌లో నమోదు కావాలని చెప్పారు. రిజిస్ట్రేషన్ చేయించుకోని ఫార్మర్ ఐడీ వచ్చిన వారికి మాత్రమే 2025–26 నుంచి సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు, పీఎం కిసాన్ అన్నదాత సుఖీభవ వర్తిస్తాయని తెలిపారు. దుక్కుల్లో కాంప్లెక్స్ ఎరువులు వాడిన తరువాత పైపాటుగా భాస్వరం, కాంప్లెక్స్ ఎరువులు వాడకూడదని తెలిపారు. కార్యక్రమంలో నరసరావుపేట సహాయ వ్యవసాయ సంచాలకులు పి మస్తానమ్మ, మండల వ్యవసాయాధికారి టి.శ్రీలత, ఏఈవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పంట పొలం పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

వీరాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

నకరికల్లు: మండలంలోని రూపెనగుంట్ల గ్రామంలో వీరాంజనేయస్వామి తిరునాళ్ల వేడుకల్లో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి పాల్గొన్నారు. సోమవారం రాత్రి గ్రామానికి వచ్చిన ఆయన ఆలయంలోని స్వామివారిని దర్శించుకొని విశేష పూజల్లో పాల్గొన్నారు. అనంతరం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్మించిన ప్రభల వద్దకు వెళ్లి ప్రజలకు అభివాదం చేశారు. తిరునాళ్ల శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట పార్టీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు పడాల శివారెడ్డి తదితరులు ఉన్నారు.

ఈపూరులో ఘనంగా తిరునాళ్ల

ఈపూరు(శావల్యాపురం): మండలంలోని ఈపూరు గ్రామంలో వేంచేసియున్న బోటిమీది శ్రీప్రసన్నాంజనేయ స్వామి 56వ వార్షిక తిరునాళ్ల వేడుకలు గ్రామస్తులు దాతలు ఆలయ ధర్మకర్త రావూరి చంద్రశేఖర్ కమిటీ సభ్యుల బోండాల శ్రీను, వేజండ్ల మహేష్‌లు ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా అత్యంత భక్తి శ్రద్ధలతో భక్తులు ఘనంగా మంగళవారం నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు ప్రసాదు సారథ్యంలో స్వామివారి మూల విరాట్‌ను పూల దండలతో నూతన వస్త్రాలతో అలంకరణ చేశారు. తెల్లవారుజాము నుంచి స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు ఆకు పూజలు విశేష పూజలు నిర్వహించారు. దేవాలయ ప్రాంగణంలో మహిళలు పొంగళ్ళు పొంగించి, తమ మొక్కులు తీర్చుకున్నారు. మొక్కుబడి ప్రభలతో చిన్నారులు వివిధ గ్రామాలు తరలివచ్చి స్వామివారిని దర్శించుకొని సందడి చేశారు. దేవాలయాన్ని విద్యుత్ కాంతులతో పూలదండలతో ముస్తాబు చేశారు. నియోజకర్గంలో ప్రసిద్ధి చెందిన ఈ తిరునాళ్ల వేడుకలకు ఎండను సైతం లెక్కచేయకుండా భక్తులు వేల సంఖ్యలో స్వామి వారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. వినుకొండ రూరల్ సీఐ బి.ప్రభాకర్‌రావు పర్యవేక్షణలో స్థానిక ఎస్సై ఎం.ఉమామహేశ్వరరావు 200 పోలీసు సిబ్బందితో తిరునాళ్ళలో ట్రాఫిక్ అంతరాయం వాటిల్లకుండా శాంతి భద్రతలు పర్యవేక్షణ చేశారు. శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థలు పులిహోర మజ్జిగ ప్యాకెట్లు, దద్దోజనం, తదితరవన్నీ భక్తులకు పంపిణీ చేశారు. తిరునాళ్ల వేడుకల సందర్భంగా ఐదు విద్యుత్ ప్రభలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.



ప్రత్యేక అలంకరణలో స్వామి వారి మూలవిరాట్

కారుమంచిలో పర్యటించిన సంక్షేమ శాఖ ఏడీ

శావల్యాపురం: మండలంలోని కారుమంచిలోని సరోజనీదేవి మెమోరియల్ చెవిటి మూగ, మానసిక దివ్యాంగుల పాఠశాలను ఉమ్మడి గుంటూరు జిల్లాల వేల్ఫేర్ దివ్యాంగుల వయోవృద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టరు సి.హెచ్.సువార్త మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థల సారథ్యంలో కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్వహించే చెవిటి, మూగ, మానసిక దివ్యాంగుల కల్గియున్న ఇలాంటి సొసైటీలు జిల్లాలో 10 ఉన్నాయన్నారు. స్కూల్స్‌లో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, వసతులు ఉపాధ్యాయులు పనితీరు విద్యార్థులకు బోధించే విధానాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి అనంతరం కేంద్ర ప్రభుత్వానికి నివేదిక రూపంలో పంపుతామన్నారు. పాఠశాలలో 37 మంది చెవిటి, మూగ, మానసిక దివ్యాంగులు ఉన్నారన్నారు. అనంతరం రికార్డులు, విద్యార్థుల హాజరు పట్టిక తదితరవన్నీ పరిశీలించారు. ఎంఈవో-2 పుసులూరి లలితకుమారి, సొసైటీ డైరెక్టరు వరమ్మ, ప్రిన్సిపాల్ గుంటకల అంకమ్మరావు, ఉపాధ్యాయులు, ఆయాలు పాల్గొన్నారు.



కారుమంచిలో రికార్డులు తనిఖీ చేస్తున్న అధికారులు

బ్యాంకు ఉద్యోగుల సమ్మె విజయవంతం చేయాలి

చిలకలూరిపేట: కేంద్రప్రభుత్వం బ్యాంకు ఉద్యోగుల పట్ల నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించటం సరికాదని యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్ నాయకులు విమర్శించారు. యూఎఫ్‌బీయూ ఆధ్వర్యంలో ప్రభుత్వ బ్యాంకుల్లో పనిచేస్తున్న ఉద్యోగులు పట్టణంలోని ఎస్‌బీఐ వద్ద సమ్మె సన్నాహక సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్యాంకు సిబ్బందికి వారంలో ఐదు రోజుల పనిదినాలు అమలు చేయాలని కోరారు. బ్యాంకుల్లో ఖాళీగా ఉన్న అన్ని తరగతుల ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. టెంపరరీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని కోరారు. వివిధ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 24,25 తేదీల్లో బ్యాంకు ఉద్యోగుల దేశ వ్యాప్త సమ్మె విజయవంతం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



సమ్మె సన్నాహక సమావేశంలో బ్యాంకుల ఉద్యోగులు

అనారోగ్యంతో రిటైర్డ్ హెచ్ఎం మృతి

నాదెండ్ల: ఎండుగుంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎంగా పనిచేసి పదవీ విరమణ పొందిన యాదగిరి కోటేశ్వరరావు (73) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. కనపర్రు గ్రామానికి చెందిన ఈయన ఎండుగుంపాలెం జెడ్పీ హైస్కూలులో హెచ్ఎంగా పనిచేస్తూ 2010లో ఉద్యోగ విరమణ పొందారు. సాతులూరు, ఎండుగుంపాలెం స్కూల్ అసిస్టెంట్‌గా దీర్ఘకాలం పనిచేశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. ఆయన మృతి పట్ల సర్పంచ్ పెరుమాళ్ళపల్లి వెంకటేశ్వర్లు, మాజీ ఉపసర్పంచ్ పచ్చవ కోటేశ్వరరావు, స్థానిక నాయకులు, ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు.



కోటేశ్వరరావు (ఫైల్)

విక్రయ హక్కులకు వేలం

బెల్లంకొండ: మండలంలోని బెల్లంకొండ క్రాస్‌రోడ్ వద్ద గల కోళ్లూరు ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ పరిధిలోని దుకాణాలలో విక్రయహక్కులకై మంగళవారం వేలం నిర్వహించినట్లు మండల దేవాలయ శాఖ ఈఓ అవుదూరి వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. కొబ్బరి చిప్పలు పోగు చేసుకొను హక్కుకు రూ.1,03,000, క్యాంటిన్, కూల్ డ్రింక్స్ విక్రయాలకు రూ.1,03,000, ప్రసాదాలు విక్రయించుకునే హక్కుకై రూ.50,000 లకు వేలంలో దక్కించుకున్నట్లు తెలిపారు. ఈ మూడింటిపై రూ. 2,56,000 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. అదేవిధంగా కొబ్బరికాయలు, పూజా ద్రవ్యములు అమ్ముకునే హక్కు, చిత్రపటాలు అమ్ముకునే హక్కు, తలనీలాలు పోగు చేసుకునే హక్కులకు వేలంలో పాల్గొనేందుకు ఎవరూ రాకపోవడంతో వాయిదా వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సత్తెనపల్లి దేవదాయ శాఖ ఇన్స్‌పెక్టర్ వి.లీలావతి, దేవదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు చిరుమామిళ్ళ హైస్కూలులో ఫేర్‌వెల్

నాదెండ్ల: చిరుమామిళ్ళ నడికట్టు రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం పదో తరగతి విద్యార్థులకు ఫేర్‌వెల్ నిర్వహిస్తున్నట్లు హెచ్ఎం సుందరరావు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గోల్కొండ గ్రూపు సంస్థల చైర్మన్, విద్యాదాత నడికట్టు రామిరెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు.

రేపు విద్యుత్ వినియోగదారుల న్యాయ సదస్సు

చిలకలూరిపేట: పట్టణంలోని సుబ్బయ్యతోటలో ఉన్న విద్యుత్ ఉపకేంద్రంలో విద్యుత్ వినియోగదారుల న్యాయ సదస్సు గురువారం నిర్వహిస్తున్నట్లు గుంటూరు టౌన్-2 విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వై ఏడుకొండలు తెలిపారు. ఈ సదస్సులో గుంటూరు టౌన్-2 డివిజన్ పరిధిలోని చిలకలూరిపేట టౌన్-1, టౌన్-2, రూరల్, గణపవరం, యడ్లపాడు, డోకిపర్రు, ఫిరంగిపురం, పత్తిపాడు, వట్టిచెరుకూరు సెక్షన్లకు సంబంధించి విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తామన్నారు. సదస్సు ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు నిర్వహించబడుతుందన్నారు. సదస్సులో విశ్రాంత జిల్లా న్యాయమూర్తి ఎన్ విక్టర్ ఇమ్మానియేల్, సాంకేతిక సభ్యులు కె వెంకటకృష్ణ, ఆర్థిక సభ్యులు ఆర్‌సీహెచ్ శ్రీనివాసరావు, స్వంతంత్ర్య సభ్యులు ఎ.సునీత పాల్గొని రాత పూర్వకంగా ఇచ్చిన విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తారన్నారు.

వచ్చే నెలాఖరు వరకు సాగు నీరు ఇవ్వాలి

నరసరావుపేట రూరల్: నాగార్జునసాగర్ నుంచి సాగునీటిని ఏప్రియల్ చివరి వరకు విడుదల చేసి పంటలను కాపాడాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని రావిపాడు సమీపంలోని పంట పొలాలను మంగళవారం పీడీఎం నాయకులు నల్లపాటి రామారావు, వై.వెంకటేశ్వరరావు, జి.రామకృష్ణ, షేక్ మస్తాన్‌వలిలు పరిశీలించారు. కుడికాలువ ఆయుకట్టు మార్చి, వరి, పసుపు, మొక్కజొన్న తదితర పంటలు సాగవుతున్నాయని తెలిపారు. కుడికాలువ పరిధిలో వారాబంది విధించడం వల్ల సాగునీరు అందక పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. పంటలకు గిట్టుబాటు ధర కూడా లేని పరిస్థితుల్లో సాగు నీరు కూడా అందక పంటలు ఎండిపోతే రైతులు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. వారబందీని రద్దు చేసి ఏప్రియల్ చివరి వరకు సాగునీటిని అందించాలని కోరారు.

కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు ఆహ్వానం

వినుకొండ: పురపాలక సంఘానికి సంబంధించి 2024–25 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని బీసీ కార్పొరేషన్, ఈబీసీ, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ కార్పొరేషన్లకు సంబంధించి లబ్ధిదారులకు బీసీ కార్పొరేషన్ ద్వారా వివిధ పథకాల ద్వారా సబ్సిడీ మంజూరు చేయుటకు దరఖాస్తుదారులు ఆహ్వానిస్తున్న మున్సిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్ తెలిపారు. ఏపీఓబీఎంఎంఎస్ ద్వారా వారి పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకొనుటకు ఈ నెల 10వ తేదీ నుంచి 22వతేదీ వరకు అవకాశం ఉందని తెలిపారు. మరిన్ని వివరాలకు మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

సర్వే త్వరితగతిన పూర్తి చేయండి

బొల్లాపల్లి: పీ4 సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీవో పి.సీతారామయ్య ఆదేశించారు. మండలంలోని పలు పంచాయతీల్లో నేటికీ దాదాపుగా 30 శాతం పీ 4 సర్వే పూర్తయిందని తెలిపారు. మిగిలినది త్వరగా పూర్తి చేయాలని అన్నారు. సిబ్బంది ఉదయం, సాయంత్రం వేళల్లో సర్వే చేసే విధంగా సూచనలు చేశారు. ప్రస్తుతం వ్యవసాయ సీజన్ కావడం.. బిజీగా ఉండటం వలన సమయం చూసుకొని సర్వే కొనసాగించాలని సిబ్బందికి సూచించారు.

నేడే సాయిబాబా ఆలయ 25వ వార్షికోత్సవం

రొంపిచర్ల: స్థానిక షిర్డీ సాయిబాబా ఆలయ 25 వార్షికోత్సవ వేడుకలను బుధవారం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు భక్త బృందం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. దేవాలయ వార్షికోత్సవం సందర్భంగా ఉదయం నుండి స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హారతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. వేడకల్లో పాల్గొనే భక్తులకు ఉచిత అన్న ప్రసాద వితరణ కార్యక్రమం కూడా ఏర్పాటు చేస్తున్నారు. భక్తులందరూ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని భక్త బృందం కోరింది.

నేడు అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట

క్రోసూరు: క్రోసూరులో బుధవారం జరగనున్న అభయాంజనేయ స్వామి 32 అడుగుల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా గత రెండు రోజులుగా జరుగుతున్న పూజా కార్యక్రమాలు మంగళవారం కొనసాగాయి. పుణ్య దంపతులు పాల్గొని హోమాలు నిర్వహించారు. నవగ్రహాలను, దేవీ దేవతలను ప్రసన్నం చేసుకొనేందుకు, ఆవాహనం చేసుకొనేందుకు సంబంధించిన యజ్ఞ యాగాలు నిర్వహించారు.